

చౌక యాత్ర

అతి తక్కువ బడ్జెట్‌లో మనకు వీలైన సమయానికే ఎంచుకున్న పర్యటన పూర్తయితే ఆ ఆనందమే వేరు. అలాంటి ఔత్సాహికుల కోసం వైహెచ్ఏఐ తోడ్పాటు అందిస్తోంది. 8లో▸



గరిష్టం/కనిష్టం
36.3 /22.4

వాతావరణం

ఆకాశం కొంతమేర మేఘావృతమౌతుంది. ఉష్ణోగ్రతలు పెరుగుతాయి. మధ్యాహ్నం ఎండ తీవ్రత అధికంగా ఉంటుంది. ఒకటిరెండో చోట్ల వర్షం పడే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

ఏరియా ఆస్పత్రిని సందర్శించిన లక్ష్య బృందం



ఆస్పత్రిలో పరిశీలిస్తున్న లక్ష్య బృందం సభ్యులు

భైంసాటౌన్: భైంసా ఏరియా ఆస్పత్రిని లక్ష్య బృందం శనివారం సందర్శించింది. ప్రభుత్వ ఆస్పత్రుల్లో సౌకర్యాలు, వసతులు, నిర్వహణ, తదితర అంశాలపై ఈ బృందం తనిఖీలు నిర్వహిస్తుంది. ఇందులో భాగంగా భైంసా ఏరియా ఆస్పత్రిని సందర్శించినట్లు సూపరింటెండెంట్ కాశీనాథ్ తెలిపారు. బృందం సభ్యులు ఆస్పత్రిలో వార్డులు కలియదిరిగి రోగులకు అందుతున్న వసతులు, రికార్డులు, నిర్వహణ తదితర అంశాలు పరిశీలించారు. లక్ష్య బృందంలో డాక్టర్లు బిందు, రెజీనారాణి, క్వాలిటీ కంట్రోల్ మేనేజర్ రిజ్వాన్, ఆర్ఎంవో సురేందర్, సిబ్బంది ఉన్నారు.

కమిషనర్‌ను తొలగించాలని ఫిర్యాదు



చైర్మన్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

ఖానాపూర్: విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న ఖానాపూర్ మున్సిపల్ కమిషనర్ రత్నాకర్‌రావును తొలగించాలని కౌన్సిలర్లు చైర్మన్ అంకం రాజేందర్‌కు శనివారం లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. విధులు సక్రమంగా నిర్వహించకపోవడంతోపాటు పారిశుధ్య కార్మికులకు వేతనాలు సైతం చెల్లించకుండా నిర్లక్ష్యం చేస్తున్నాడని ఆరోపించారు. ఇష్టారాజ్యంగా అనుమతులు ఇవ్వడంతోపాటు మున్సిపాలిటీలో నెలకొన్న సమస్యలను పట్టించుకోవడం లేదన్నారు. కమిషనర్‌ను వెంటనే బదిలీ చేయాలని డిమాండ్ చేశారు. వైస్ చైర్మన్ ఖలీల్, మున్సిపల్ కాంగ్రెస్ ఫ్లోర్ లీడర్ చిన్నం సత్యం, కౌన్సిలర్లు, నాయకులు కావలి సంతోష్, తొంటి శ్రీనివాస్, పరిమి సురేశ్, జన్నారపు శంకర్,

డిపో అభివృద్ధికి పాటుపడాలి



ఉత్తమ ఉద్యోగులతో డిపో మేనేజర్ సాయన్న

నిర్మల్‌టౌన్: ఆర్టీసీ ఉద్యోగులందరూ డిపో అభివృద్ధికి పాటుపడాలని నిర్మల్ డిపో మేనేజర్ సాయన్న అన్నారు. జిల్లా కేంద్రంలోని డిపో కార్యాలయంలో ఆదర్శ ఉద్యోగుల అభినందన సభను శనివారం నిర్వహించారు. ఫిబ్రవరిలో అత్యధిక ఆదాయం తీసుకువచ్చిన కండక్టర్లు కే జీ.రాం, పొచ్చెర గంగాధర్, డ్రైవర్లు అజీంఖాన్, అలీంకు ప్రశంసాపత్రం, నగదు బహుమతి అందజేశారు. సహాయ మేనేజర్లు రాజశేఖర్, శ్రీకర్, విజయేందర్ పాల్గొన్నారు.

రెవెన్యూ అసోసియేషన్ కార్యవర్గానికి సన్మానం



సన్మానిస్తున్న అసోసియేషన్ ప్రతినిధులు

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలోని విశ్రాంత ఉద్యోగుల సంఘ భవనంలో నూతనంగా ఎన్నికైన రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ నిర్మల్ జిల్లా అధ్యక్షుడు వెంకటరమణ (తహసీల్దార్) జిల్లా ప్రధాన కార్యదర్శి అశోక్ (తహసీల్దార్)ను శనివారం ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో నిర్మల్ జిల్లా విశ్రాంత ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు ఏంసీ.లింగన్న పాల్గొన్నారు.

పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి



మాట్లాడుతున్న డీఆర్డీవో విజయలక్ష్మి

భైంసారూరల్: గ్రామాల్లో ప్రజలు పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని డీఆర్డీవో విజయలక్ష్మి అన్నారు. మండలంలోని వానల్‌పాడ్ రైతువేదికలో ఏర్పాటు చేసిన శిక్షణ తరగతులకు శనివారం హాజరై మాట్లాడారు. గ్రామీణులకు మరుగుదొడ్లు, ఇంకుడు గుంతలపై ప్రజాప్రతినిధులు, అధికారులు అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ కల్పనజాదవ్, ఎంపీడీవో గోపాలకృష్ణారెడ్డి, సర్పంచ్ రాజన్న, తదితరులు పాల్గొన్నారు.

ఇప్పుడేం చేద్దాం..!



జిల్లా గ్రంథాలయంలో ప్రిపేరవుతున్న అభ్యర్థులు

- పేపర్ లీకేజీలతో.. రద్దయిన పరీక్షలు
- పరేషాన్‌లో అభ్యర్థులు
- ఆర్థిక ఇబ్బందుల్లో తల్లిదండ్రులు

నిర్మల్: 'ఏం రా బిడ్డా ఎట్లున్నవ్... టిఫిన్ తిన్నవా లేదా..! ఈరోజు హాస్టల్‌లో ఏం పెట్టిన్రు. అరె నాన్న.. నువ్వేం టెన్షన్ పడకురా. నువ్వు మంచిగ తినుకుంట, బాగా చదువుకో అంతే. ఇవ్వాళ కాక పోతే రేపు.. రద్దు చేసిన పరీక్షలు ఎట్లన్న పెడతరు. అప్పటిదాకా నువ్వింక బాగా చదువుకో. అర్థమైందా బేటా.. నువ్వక్కడ టెన్షన్ పడకు అమ్మ, తమ్ముడు అందరం బాగున్నం..'అని మధు ఫోన్లో మాట్లాడుతుంటే.. 'సరే నాన్నా.. నేను బాగానే ఉన్నా కానీ..' అని హైదరాబాద్ హాస్టల్‌లో ఉంటున్న హారిక ఏదో చెప్పబోయి ఆపేసింది. 'ఏమైందిరా.. ఏదో కానీ.. అంటున్నవ్ చెప్పు..' అని మధు ఒకటికి రెండుసార్లు అడిగేసరికి.. 'ఏం లేదు నాన్నా.. మరో నెల గడిచిపోయింది. మళ్లీ హాస్టల్ ఫీజు కట్టాలి. చిన్నచిన్న ఖర్చులు కూడా ఉన్నాయి..' అంటూ బిడ్డ చెబుతుండగానే.. 'నీకెందుకు నాన్నా.. నేనే డబ్బులు నీ ఫోన్‌కు పంపిస్తా. నువ్వేం టెన్షన్ పడకు. బాగా చదువుకో.. సరేనా..' అంటూ మధు ఫోన్ పెట్టేశాడు. ఫోన్లో బిడ్డకు ధైర్యమైతే చెప్పాడు కానీ.. మధ్యతరగతి కుటుంబం, ప్రైవేటు ఉద్యోగం చేసే మధు ఆలోచనల్లో పడ్డాడు. తనలా తన పిల్లల భవిష్యత్తు కాకూడదని, బాగా చదివించాడు. పోటీ పరీక్షలకు ప్రిపేరయ్యేందుకు బిడ్డను హైదరాబాద్ హాస్టల్‌లో ఉంచుతూ కోచింగ్ పంపించాడు. త్వరలోనే పోటీ పరీక్షలు అయిపోతాయి కదా.. అని బిడ్డ ఫీజులకు పోనూ మిగిలిన డబ్బులను ఇతర ఖర్చులకు ఇచ్చేశాడు. ఇలాంటి పరిస్థితుల్లో పరీక్షలు వాయిదా పడటం, బిడ్డకు మళ్లీ డబ్బులు అవసరం పడటంతో 'ఇప్పుడెట్ల.. ఏం చేద్దాం' అని ఆలోచనలో పడ్డాడు.

ఇలా.. చాలామంది తల్లిదండ్రులు, విద్యార్థుల పరిస్థితి ఇలాగే ఉంది. కొంతమంది స్వార్థం కోసం చేసి న పేపర్ లీకేజీలతో ఇలాంటి ఎన్నో పేద, మధ్యతరగతి కుటుంబాలు ప్రస్తుతం ఇబ్బందులు పడుతున్నాయి. పైసాపైసా కూడబెట్టి పిల్లలను చదివిస్తుంటే.. ఇలా లీకులు షాకులు ఇస్తున్నాయని వాపోతున్నారు.

హైదరాబాద్ వరకు..

జిల్లాలో సరైన కోచింగ్ సెంటర్లు లేకపోవడంతో చాలామంది తల్లిదండ్రులు తమ పిల్లలను హైదరాబాద్ పంపించారు. అక్కడ హాస్టల్‌లో ఉంటూ కోచింగ్‌కు వెళ్తున్నారు. ఈమధ్య ఉద్యోగాల జాతర పేరుతో వరుసగా ప్రభుత్వం నోటిఫికేషన్లు ఇచ్చింది. కొన్ని పోస్టులకు ఏళ్ల తర్వాత ఇప్పుడే నోటిఫికేషన్ రావడంతో ప్రస్తుతం చేస్తున్న ప్రైవేటు జాబ్‌లు, పనులు అన్నీ వదులుకుని అభ్యర్థులు ప్రిపరేషన్‌పై దృష్టి పెట్టారు.

అభ్యర్థుల ఖర్చుల వివరాలు..

కోచింగ్ ఫీజు	రూ.30 వేలు - 40 వేలు
హాస్టల్ ఫీజు(నెలకు)	రూ.6 వేలు - 8 వేలు
స్టడీహాల్ అద్దె(నెలకు)	రూ.2 వేలు
పుస్తకాల ఖర్చు	రూ.2 వేలు
ఇతరత్రా ఖర్చులు(నెలకు)	రూ.వెయ్యి

అప్పులు చేసి మరీ..

చాలామంది అభ్యర్థులు అప్పులు తీసుకుని మరీ హైదరాబాద్ వెళ్లారు. తమ పిల్లల భవిష్యత్తు బాగుండాలన్న ఉద్దేశంతో తల్లిదండ్రులు సైతం అక్కడా ఇక్కడా డబ్బులు సర్ది పిల్లలను పంపించారు. కరోనా తర్వాత మార్కెట్లో చేబదులు ఇచ్చేవారు తగ్గిపోయారు. అప్పు పుట్టడమూ కష్టంగానే ఉంది. ఏదైనా తాకట్టు పెడితేనే పైసలిస్తున్నారు. ఇంట్లో బంగారం బ్యాంకులో తాకట్టుపెట్టి కోచింగ్‌కు పిల్లలను పంపిన కుటుంబాలూ ఉన్నాయి. కొంతమంది రెట్టింపు వడ్డీకి డబ్బులు బాకీ తెచ్చారు. ఈసారి నౌకరీ వస్తే కష్టాలన్నీ తీరిపోతాయన్న నమ్మకంతోనే చాలామంది ఇదంతా చేశారు.

లీకులతో షాక్‌లు..

టీఎస్‌పీఎస్సీ పేపర్ లీకేజీ ఘటన అభ్యర్థులతోపాటు వారి తల్లిదండ్రులకూ షాకిచ్చింది. కొంతమంది అభ్యర్థులైతే అసిస్టెంట్ ఇంజినీర్ తదితర పరీక్షలను బాగా రాశామని, కచ్చితంగా జాబ్ వస్తదన్న నమ్మకం ఉందని, కానీ.. ఇప్పుడు ఆ పరీక్షను రద్దు చేశారని చెబుతూ చిన్నపిల్లాడిలా ఏడ్చారు. హైదరాబాద్‌తోపాటు జిల్లా కేంద్రంలోని గ్రంథాలయాల్లోనూ వందలాది మంది అభ్యర్థులు నెలల తరబడి పుస్తకాల్లోనే గడుపుతున్నారు. ఏదైనా పనిచెబితే ఎక్కడ చదువుపై ధ్యాస తప్పుతుందోనని తమ పిల్లలకు పనులు చెప్పకుండా తామే చేసుకున్న తల్లిదండ్రులూ ఉన్నారు. ఇంతగా సర్కారు నౌకరీపై ఆశలు పెట్టుకుంటే.. ఇప్పుడు పేపర్ లీకేజీ షాకిచ్చిందని వాపోతున్నారు. ఓవైపు మళ్లీ పరీక్షలు ఎప్పుడు పెడతారో తెలియని పరిస్థితి..! మరోవైపు ఆ పరీక్షలు పెట్టేదాకా తమ పిల్లలను చదివించాలా.. వద్దా అనే డైలామా..! చదివించాలంటే.. మళ్లీ హాస్టల్ ఫీజులు, ఇతరత్రా ఖర్చులకు డబ్బులు కావాలి.

పరీక్షలు త్వరగా పెట్టాలి..



ప్రభుత్వం పేపర్ లీకేజీలపై సీరియస్‌గా వ్యవహరించాలి. సిట్టింగ్ జడ్జితో విచారణ చేపట్టి, మరోసారి ఇలా జరగకుండా బాధ్యులపై కఠినచర్యలు తీసుకోవాలి. అభ్యర్థులకు ఇబ్బంది పెట్టకుండా వీలైనంత త్వరలో పోటీ పరీక్షలు నిర్వహించాలని కోరుతున్నాం.

– మహేందర్, అభ్యర్థి, నిర్మల్

ప్రతీ కార్యకర్తకు పార్టీ అండ



ఆత్మీయ సమ్మేళనంలో మాట్లాడుతున్న మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి

- మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి
- సోన్‌లో బీఆర్ఎస్ ఆత్మీయ సమ్మేళనం

లక్ష్మణచాంద: పార్టీ కోసం పనిచేసే ప్రతీ కార్యకర్తకు బీఆర్ఎస్ పార్టీ అండగా ఉంటుందని రాష్ట్ర అటవీ, న్యాయ, దేవాదాయ శాఖ మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి అన్నారు. సోన్ మండల కేంద్రంలోని గురడి కాపు సంఘం భవనంలో శనివారం బీఆర్ఎస్ ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఐకే రెడ్డి హాజరయ్యారు. ముందుగా సోన్‌లో భారత రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్, చాకలి ఐలమ్మ విగ్రహాలకు పూల మాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం గ్రామంలోని శివాలయంలో ప్రత్యేక పూజలు చేశా రు. తర్వాత ఆత్మీయ సమ్మేళనంలో మాట్లాడారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో విద్యుత్ కోతలతో రైతులు ఇబ్బందులు పడేవారన్నారు. తెలంగాణలో వ్యవసాయానికి 24 గంటలు ఉచిత విద్యుత్ వస్తోందని తెలి పారు. సోన్ మండలం న్యూవెల్మల్, బొప్పారంలో రూ.1,200 కోట్లతో 400 కేవీ విద్యుత్ సబ్ స్టేషన్ నిర్మించుకున్నామన్నారు. మాదాపూర్, సోన్, జాఫ్రాపూర్, పాక్‌పట్ల గ్రామాల్లో విద్యుత్ సబ్ స్టేషన్లు ఏ ర్పాటు చేశామన్నారు. ఇటీవల కురిసిన అకాల వర్షాలకు పంట నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.10 వేల పరిహారం ఇస్తామన్నారు. రైతుబంధు, రైతుబీమాతో రైతులకు ప్రభుత్వం అండగా నిలుస్తోందని తెలిపారు. రైతులు పండించిన పంటలన్నీ ప్ర భుత్వమే కొనుగోలు చేస్తుందని పేర్కొన్నారు. మ హారాష్ట్రలో పింఛన్ కేవలం రూ.600 ఇస్తుండగా తెలంగాణలో రూ.2,016 ఇస్తున్నామన్నారు. దళితబంధు పథకం కింద ఈ ఏడాది నియోజకవర్గానికి 1,100 మందికి రూ.10 లక్షల సాయం అందిస్తామన్నారు. సోన్ మండలంలో ఆయిల్‌పాం ఫ్యాక్టరీ రూ.250 కోట్ల నిర్మిస్తామని తెలిపారు. కార్యక్రమంలో నిర్మల్ మాజీ ఎమ్మెల్యే నల్ల ఇంద్రకరణ్‌రెడ్డి, రైతుబంధు సమితి జిల్లా అధ్యక్షుడు వెంకట్రామ్‌రెడ్డి, నిర్మల్ మున్సిపల్ చైర్మన్ ఈశ్వర్, నిర్మల్ మార్కెట్ కమిటీ చైర్మన్ రమణ, జెడ్పీటీసీ జీవన్‌రెడ్డి, మంత్రి తనయుడు అల్లోల గౌతమ్‌రెడ్డి, సర్పంచ్ వినోద్, పీఏసీఎస్ చైర్మన్ కృష్ణప్రసాద్‌రెడ్డి, ఎఫ్ఎస్‌సీఎస్ చైర్మన్ రాజేందర్, బీఆర్ఎస్ మండల కన్వీనర్ మోయినొద్దీన్, నాయకులు అల్లోల మురళీధర్‌రెడ్డి, రైతుబంధు సమితి మండల అధ్యక్షుడు మహేందర్‌రెడ్డి, రామేశ్వర్‌రెడ్డి, నిర్మల్ ఎంపీపీ, ఆత్మ చైర్మన్ గంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



అంబేద్కర్ విగ్రహానికి నమస్కరిస్తున్న మంత్రి

'మంత్రి క్షమాపణ చెప్పాలి'



మాట్లాడుతున్న గంగాప్రసాద్

భైంసాటౌన్: పేపర్ లీకేజీ సాధారణమని మాట్లాడిన రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి నిరుద్యోగులకు, విద్యార్థులకు క్షమాపణ చెప్పాలని ఏబీవీపీ నాయకులు డిమాండ్ చేశారు. ఏబీవీపీ పట్టణ శాఖ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన సమావేశంలో ఇందూర్ విభాగ్ ఎస్ఎఫ్‌డీ కన్వీనర్ గంగాప్రసాద్ మాట్లాడారు. టెన్త్, ఇంటర్, టీఎస్‌పీఎస్సీ పేపర్ లీక్ సర్వసాధారణమని మాట్లాడిన మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డిని సిట్ విచారణ చేయాలని డిమాండ్ చేశారు. నిరుద్యోగులకు మంత్రి క్షమాపణ చెప్పకుంటే రాష్ట్రవ్యాప్తంగా ఆయన్ను అడ్డుకుంటా మని హెచ్చరించారు. అలాగే సిట్ మంత్రి కేటీఆర్ ను కూడా విచారణ చేయాలన్నారు. టీఎస్‌పీఎస్సీని ప్రక్షాళన చేయాలని, చైర్మన్ జనార్దన్‌రెడ్డి, సెక్రెటరీ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఉద్యమం ఉధృతం చేస్తామన్నారు. కార్యక్రమంలో నగర ఉపాధ్యక్షుడు చంద్రకాంత్, మనోజ్, చక్రధర్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ నాయకుల ముందస్తు అరెస్ట్



సోన్ పోలీసులు అరెస్టు చేసిన బీజేపీ నాయకులు

లక్ష్మణచాంద(సోన్): బీఆర్ఎస్ ఆత్మీయ సమ్మేళనా లకు హాజరవుతున్న మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డికి మూ డు రోజులుగా నిరసన సెగ తప్పడం లేదు. బీజేపీ, ఏబీవీపీ నాయకులు మంత్రి కాన్వాయ్‌కి అడ్డుపడుతున్నారు. దీంతో సోన్ మండలంలో శనివారం ఆత్మీయ సమ్మేళనం ఉన్న నేపథ్యంలో మండలంలోని బీజేపి నాయకులను పోలీసులు ముందస్తుగా అరెస్ట్ చేశారు. పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఆత్మీయ సమ్మేళనం ముగిసిన తర్వాత ఇంటికి పంపారు. అరెస్ట్ అయినవారిలో బీజేపీ దళిత మోర్చా జిల్లా అధ్యక్షుడు సాగర్, మండల అధ్యక్షుడు ప్రేమ్ కుమార్, నాయకులు అశోక్, రవి, సాయన్న, నడుకుడ నారాయణ తదితరులు ఉన్నారు.

అక్రమ దందా.. ఆగేదెలే!



రాహుల్‌నగర్‌లో ఖత్‌గాం వెళ్లే దారి సమీపంలో ఇసుక డంప్

- జోరుగా ఇసుక అక్రమ రవాణా
- డంప్ చేసి సొమ్ము చేసుకుంటున్న అక్రమార్కులు

భైంసాటౌన్: ఇసుక అక్రమదందా ఆగడం లేదు. వాగుల్లో నుంచి రాత్రి సమయాల్లో ఇసుక అక్రమంగా తరలించి డంప్ చేసుకుంటున్నారు. అనంతరం ట్రాక్టర్లలో తరలించి విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. ఇసుక అక్రమ రవాణాను అడ్డుకునేందుకు ఇటీవల కలెక్టర్ మార్గదర్శకాలు సవరిస్తూ ఆదేశాలు సైతం జారీ చేశారు. కానీ, కలెక్టర్ ఆదేశాలను సైతం అక్రమార్కులు తుంగలో తొక్కుతూ ఇసుక దందా సాగిస్తూ ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్నారు.

ఆదేశాలు బేఖాతరు..

జిల్లాలోని వాగుల నుంచి ఇసుక అక్రమ రవాణా చేయవద్దని, ఇసుక తరలించేందుకు ట్రాక్టర్‌కు రూ.801 తహసీల్దార్ పేరిట డీడీ చెల్లించాలని ఆదేశాలున్నాయి. అక్రమార్కులు ఈ నిబంధనలను పట్టించుకోవడం లేదు. ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తున్నారు. భైంసా పట్టణంలోని సుద్దవాగు, మండలంలోని ఖత్‌గాం, కామోల్, హస్గుల్, మాటేగాం, పెండ్‌పెల్లి, ఇతర గ్రామాల్లోని వాగుల నుంచి నిత్యం వందలాది ట్రాక్టర్లలో ఇసుక అక్రమ రవాణా జరుగుతోంది. ఇప్పటి వరకు 60 ట్రాక్టర్లకు మాత్రమే అనుమతిచ్చినట్లు అధికారులు చెబుతున్నారు. ఏదో నామమాత్రంగా అధికారుల అనుమతిపొంది, చాలావరకు ట్రాక్టర్లలో అనుమతులు లేకుండా తరలించేస్తున్నారు.

భారీగా ఇసుక డంపులు..

భైంసా రెవెన్యూ డివిజన్ పరిధిలో చాలాచోట్ల భారీగా ఇసుక డంప్ చేశారు. వాగుల్లో నుంచి రాత్రివేళల్లో ఇసుక తరలిస్తూ ఖాళీస్థలాల్లో నిల్వ చేస్తున్నారు. ఇది వరకు వాగుల నుంచి ఇసుకను నేరుగా ట్రాక్టర్లలో తరలించి విక్రయించుకునేవారు. ఇటీవల కలెక్టర్ ఆదేశాలు జారీ చేయడంతో అక్రమార్కులు రూటు మార్చారు. వాగు పరీవాహక ప్రాంతాల నుంచి ఇసుకను తీసుకొచ్చి ఖాళీస్థలాలు, వెంచర్లలో డంప్ చేస్తున్నారు. ఇలా భైంసా పట్టణంలోనే దాదాపు 20–30 వరకు ఇసుక డంపులు ఉన్నాయి. ఇవన్నీ అధికారులకు తెలిసినా ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు. డంపులను సీజ్ చేయడం ద్వారా ప్రభుత్వానికి ఆదాయం సమకూరుతుంది.

చర్యలు తీసుకుంటాం..

ఇసుక తరలించేవారు ముందస్తుగా తహసీల్దార్ పేరిట డీడీ చెల్లించి అనుమతి పొందాల్సి ఉంటుంది. ఇసుక అక్రమంగా తరలిస్తే జరిమానా విధిస్తున్నాం. ఇప్పటి వరకు ఇసుక రవాణా కోసం 60 ట్రాక్టర్ల వరకు డీడీ చెల్లించి అనుమతి పొందారు. అనుమతి లేకుండా తరలిస్తే తనిఖీలు చేసి డంప్ చేసిన ఇసుకను స్వాధీనం చేసుకుంటాం.

– చంద్రశేఖర్‌రెడ్డి, తహసీల్దార్, భైంసా

అభివృద్ధితోనే అవార్డులు

- రాష్ట్ర మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి



అవార్డులు అందుకుంటున్న సర్పంచులు

నిర్మల్‌చైన్‌గేట్: ప్రభుత్వం చేపట్టిన పల్లెప్రగతితోపాటు పలు అభివృద్ధి పనులతోనే గ్రామాలకు అవార్డులు వచ్చాయని రాష్ట్ర దేవాదాయ, అటవీ, న్యాయ, పర్యావరణ శాఖ మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని దివ్యగార్డెన్‌లో జాతీయస్థాయి పంచాయతీ అవార్డ్ – 2023కు(దీన్ దయాళ్ ఉపాధ్యాయ పంచాయతీ) ఎంపికైన గ్రామాల సర్పంచులు, కార్యదర్శులకు కలెక్టర్ వరుణ్‌రెడ్డితో కలిసి శనివారం ప్రశంసాపత్రాలు పంపిణీ చేశారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ జాతీయ పంచాయతీ అవార్డుల కోసం జిల్లా నుంచి 396 గ్రామపంచాయతీలను ప్రతిపాదించగా, 24 గ్రామ పంచాయతీలు జాతీయ అవార్డుకు ఎంపిక కాగా, 27 ఉత్తమ పంచాయతీ అవార్డులు సాధించినట్లు వివరించారు. గ్రామపంచాయతీలు సుస్థిరమైన అభివృద్ధిని సాధించాలని, తొమ్మిది విభాగాల్లో అభివృద్ధి చెందాలన్నారు. కార్యక్రమంలో జెడ్పీ సీఈవో సుధీర్, డీపీవో శ్రీలత, డీఆర్డీవో విజయలక్ష్మి, ఎంపీపీ రామేశ్వర్, ఎంపీపీలు, జెడ్పీటీసీ, ఎంపీడీవోలు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

కేటగిరీల వారీగా అవార్డులు సాధించిన పంచాయతీలు..

- పేదరికం లేని మెరుగైన జీవనోపాధి కేటగిరీలో.. లింబా(బి), చిట్యాల, ఎల్లపెల్లి.
- ఆరోగ్య కరమైన పంచాయతీల కేటగిరీలో.. రత్నాపూర్ కాండ్లీ, ముజ్గి, కొత్త మద్దిపడగ
- చైల్డ్ ఫ్రెండ్లీ కేటగిరీలో.. చిట్యాల, గొల్లమాడ, న్యూ పోచంపాడ్
- సరిపడా నీరు కేటగిరీలో.. చిట్యాల, లోలం, నచ్చన్ఎల్లాపూర్
- స్వీయ సమృద్ధితో కూడిన మౌలిక సదుపాయాలు కేటగిరీలో.. న్యూపోచంపాడ్, కుస్లి, నచ్చన్ఎల్లపూర్
- క్లీన్ అండ్ గ్రీన్ కేటగిరీలో.. వటోలి, సారంగపూర్, కొండాపూర్
- సామాజిక భద్రత కేటగిరీలో.. కంకేట, కాల్వ, సిర్గాపూర్
- గుడ్ గవర్నెన్స్ కేటగిరీలో.. గుండంపల్లి, కొట్ల(కె), ప్యారమూర్
- మహిళా స్నేహపూర్వక కేటగిరీలో.. బస్సపెల్లి, లింగాపూర్, నీలాయిపేట్

సంక్షేమంలో దేశానికి తెలంగాణ ఆదర్శం

- బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు, ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి
- బాసరలో బీఆర్ఎస్ ఆత్మీయ సమ్మేళనం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి

భైంసా: దేశంలో ఎక్కడాలేని విధంగా రాష్ట్రంలో సంక్షేమ పథకాలు తెలంగాణలో అమలవుతున్నాయని, దేశానికే తెలంగాణ ఆదర్శంగా నిలిచిందని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, ముధోల్ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి అన్నారు. బాసరలో పార్టీ ఆత్మీయ సమ్మేళనం శనివారం నిర్వహించారు. అంతకుముందు బాసర శ్రీ జ్ఞానసరస్వతీ అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆత్మీయ సమ్మేళనంలో మాట్లాడారు. రైతులకు రైతుబంధు, బీమా వంటి పథకాలు అమలు చేస్తున్న ఏకైక రాష్ట్రం తెలంగాణ అని తెలిపారు. ఆడపిల్లల పెళ్లికి కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాలతో అండగా నిలుస్తున్నామన్నారు. వ్యవసాయానికి 24 గంటలు ఉచిత విద్యుత్ ఇస్తున్న రాష్ట్రం తెలంగాణ అని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి వచ్చే ఎన్నికల్లో మూడోసారి బీఆర్ఎస్ గెలిచేలా చూడాలని కార్యకర్తలకు సూచించారు.

వీవోఏలను సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించాలి



డీఆర్డీఓకు వినతిపత్రం ఇస్తున్న వీవోఏలు

నిర్మల్‌చైన్‌గేట్: విలేజ్ ఆర్గనైజేషన్ అసిస్టెంట్లను సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించాలని జిల్లా అధ్యక్షురాలు జయశీల కోరారు. వీవోఏల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ డీఆర్డీవో విజయలక్ష్మికి శనివారం వినతిపత్రం అందించారు. ఉద్యోగ భద్రతతోపాటు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలన్నారు. రూ.10 లక్షల సాధారణ బీమా సౌకర్యం కల్పించాలని కోరారు. సెర్ప్ నుంచి గుర్తింపు కార్డులు ఇవ్వాలన్నారు. గ్రామ సంఘం గ్రౌండింగ్‌తో సంబంధం లేకుండా ప్రతినెలా వేతనాలు వ్యక్తిగత ఖాతాల్లో జమ చేయాలని సూచించారు. అర్హులైన వీవోలకు సీసీలుగా ప్రమోషన్ ఇవ్వాలన్నారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ ప్రభాకర్, రమేశ్, జిల్లా కోశాధికారి స్వప్న, వివిధ మండలాల వీవోఏలు పాల్గొన్నారు.

క్లుప్తంగా

27న ఈపీఎఫ్‌పై అవగాహన సదస్సు

కైలాస్‌నగర్: ఉద్యోగుల భవిష్యనిధి సంస్థ ఆధ్వర్యంలో నిధి ఆప్కే నికత్–2.0 (భవిష్య నిధి మీ వద్దకు) అంశంపై ఈ నెల 27న ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా వ్యాప్తంగా అవగాహన, ఔట్‌రిచ్ ప్రోగ్రాం నిర్వహిస్తున్నట్లు ఆ సంస్థ అసిస్టెంట్ కమిషనర్ పి.సుబ్రహ్మణ్యం శనివారం తెలిపారు. ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో డీఆర్‌డీఏ కాన్ఫరెన్స్ హాల్, మంచిర్యాల జిల్లాకు సంబంధించి దేవాపూర్‌లోని ఓరియంట్ సిమెంట్ ఫ్యాక్టరీ మీటింగ్‌హాల్‌లో, ఆసిఫాబాద్ జిల్లాకు సంబంధించి కాగజ్‌నగర్ మున్సిపల్ కార్యాలయంలో, నిర్మల్ జిల్లా కేంద్రంలోని మున్సిపల్ కార్యాలయంలో ఈ సమావేశాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఉదయం 9గంటల నుంచి సాయంత్రం 5.45 గంటల వరకు కార్యక్రమాల్లో సంబంధిత జిల్లాల పరిధిలోని కార్మిక సంఘాలు, యువజనుల ఫిర్యాదులను పరిష్కరించుకోవడంతో పాటు తగు సలహాలు, సూచనలు చేయవచ్చన్నారు. ఈ అవకాశాన్ని వారు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

విద్యార్థులు కష్టపడి చదవాలి


మాట్లాడుతున్న కుమ్ర ఈశ్వరీబాయి

బేల: విద్యార్థులు కష్టపడి చదవాలని రాష్ట్ర మహిళా కమిషన్ సభ్యురాలు కుమ్ర ఈశ్వరీబాయి అన్నారు. శనివారం రాత్రి మండల కేంద్రంలోని ప్రభుత్వ గిరిజన బాలుర ఆశ్రమ పాఠశాలలో నిర్వహించిన వార్షికోత్సవానికి ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. విద్యార్థులు ఉత్తమ మార్కులు సాధిస్తే తనవంతుగా ప్రత్యేక ప్రోత్సాహక బహుమతులు అందిస్తానని తెలిపారు. అనంతరం విద్యార్థులు చేసిన సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ఇంద్రశేఖర్, హెచ్‌ఎం జ్యోతిరాం, ఉపాధ్యాయులు, ఆయా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

'ఏలేటి'పై కేసు నమోదు

నిర్మల్‌చైన్‌గేట్: రాష్ట్ర దేవాదాయ, న్యాయ, అటవీశాఖ మంత్రి ఇంద్రకరణ్ రెడ్డిపై ఈనెల 21వ తేదీన విలేకరుల సమావేశంలో ఆధారాలు లేకుండా ఆరోపణలు చేసిన ఏబీసీసీ కార్యక్రమాల అమలు కమిటీ చైర్మన్ ఏలేటి మహేశ్వర్‌రెడ్డిపై స్థానిక పోలీస్‌స్టేషన్‌లో బీఆర్‌ఎస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు మారుగొండ రాము శనివారం ఫిర్యాదు చేశాడు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిర్మల్ మున్సిపాలిటీలో 42 ఉద్యోగాలను మంత్రి అమ్ముకున్నారని అసత్య ఆరోపణలు చేసి మంత్రి పరువు ప్రతిష్ట దెబ్బతినేలా చేశాడని, అందుకే ఫిర్యాదు చేసినట్లు పేర్కొన్నాడు. కేసు నమోదు చేసినట్లు సీఐ మల్లేష్ తెలిపారు.

పంట పొలంలోకి కొండగొర్రె

సారంగపూర్: మండలంలోని దుప్యాతండా గ్రామానికి చెందిన రైతు సవాయిరాం పంటపొలంలోకి శనివారం కొండగొర్రె పిల్ల దారి తప్పి వచ్చింది. గమనించిన రైతు పట్టుకుని గ్రామంలోకి తీసుకొచ్చాడు. స్థానికులు అటవీశాఖ అధికారులకు సమాచారం ఇవ్వడంతో డెప్యూటీ రేంజ్ అధికారిణి శ్రీదేవి, ఎఫ్‌బీవో రాజసింధులు అక్కడకు చేరుకుని సదరు కొండగొర్రె పిల్లను స్వాధీనం చేసుకుని నిర్మల్ జిల్లా కేంద్రంలోని అటవీశాఖ కార్యాలయానికి తరలించారు. దాని వయస్సు సుమారు 12నుంచి 15రోజులు ఉంటుందని, అందుకే దాని రక్షణ నిమిత్తం జిల్లా కార్యాలయానికి తరలించామని డీఆర్‌వో తెలిపారు.

- తక్కువ బడ్జెట్‌లోనే పర్యాటకం
- కలిసి వస్తున్న కొత్త సహ యాత్రికులు
- ఔత్సాహికుల కోసం వెబ్‌సైట్

స్నేహితులతో కలిసి ట్రెక్కింగ్ చేయాలని.. విభిన్న ప్రదేశాలను సందర్శించాలని.. పర్యాటక ప్రాంతాలకు వెళ్లాలని అందరికీ ఉంటుంది. కానీ కొందరి అడుగే ముందుకు పడుతుంది. ఆర్థికంగా భారమని భావించడం.. కలిసి రావడానికి స్నేహితులకు సమయం కుదరకపోవడం వల్ల మరికొందరి పర్యటన వాయిదా పడుతూనే ఉంటుంది. అతి తక్కువ బడ్జెట్‌లోనే.. మనకు వీలైన సమయానికి కొత్త సహ పర్యాటకులతో పర్యటన పూర్తయితే ఆ ఆనందమే వేరు. అలాంటి ఔత్సాహికుల కోసం వైహెచ్‌ఏఐ (యూత్ హాస్టల్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా) తోడ్పాటు అందిస్తోంది.

– సాక్షి, మంచిర్యాలడెస్క్

ఇదీ వెబ్‌సైట్:
https:// www. yhaindia. org



గోవాలో ట్రెక్కింగ్‌కు హాజరైన వివిధ రాష్ట్రాల పర్యాటకులు

చౌక యాత్ర

వైహెచ్‌ఏఐ లక్ష్యం..

ప్రయాణం, పర్యాటకం, సాహస యాత్రలకు తక్కువ ధరలో తోడ్పాటు అందించడం, సామాజిక, అభివృద్ధి, సమస్యలపై యువతలో అవగాహన పెంపొందించడం వైహెచ్‌ఏఐ లక్ష్యం. ఇంగ్లాండ్‌లోని హాస్టలింగ్ ఇంటర్నేషనల్‌లో వైహెచ్‌ఏఐ సభ్యత్వం కలిగి ఉంది. దేశవ్యాప్తంగా 95 యూత్ హాస్టళ్లు కలిగి ఉంది. ఈ హాస్టళ్లలో వైహెచ్‌ఏఐ సభ్యులకు తక్కువ ధరలో వసతి, శాకాహార భోజన సౌకర్యాలు కల్పిస్తారు. వైహెచ్‌ఏఐ జాతీయ చైర్మన్ వెంకటనారాయణ్ ఆధ్వర్యంలో అన్ని చోట్ల కార్యకలాపాలకు ఏర్పాట్లు చేస్తున్నారు. దేశంలో ఇప్పటికే సొంతంగా ఎనిమిది హాస్టళ్లు ఉన్నాయి. కొత్తవి కూడా నిర్మిస్తున్నారు. ఇందులో భాగంగా దాతల సహకారంతో హిమాచల్‌ప్రదేశ్‌లోని కసోల్‌లో కూడా హాస్టల్ నిర్మాణం చేపట్టారు. హిమాచల్‌ప్రదేశ్ వంటి రాష్ట్రాల్లో ఆహారానికి ఇబ్బందులు పడకుండా ఇటీవల దక్షిణ భారతదేశ యాత్రికుల కోసం ఇడ్లీ, పొంగల్, కిచిడీ, వెజిటేబుల్ ఫ్రైడ్ రైస్ ఏర్పాటు చేస్తున్నారు.

సభ్యత్వం

వైహెచ్‌ఏఐ ఐదు రకాల సభ్యత్వాన్ని అందిస్తోంది. జీవితకాల సభ్యత్వం, సీనియర్(ఏడాది, రెండేళ్లు), జూనియర్(ఏడాది), వైహెచ్‌ఏఐ, ఐవైటీసీకో బ్రాండెడ్, ఇన్‌స్టిట్యూషనల్ సభ్యత్వం ఇస్తుంది. దేశవ్యాప్తంగా రెండు లక్షల మంది సభ్యులు ఉండగా.. ఇందులో లక్ష మంది జీవితకాల సభ్యత్వం కలిగి ఉన్నారు. అసోసియేషన్ ఆధ్వర్యంలో జాతీయ, రాష్ట్ర స్థాయిలో, వారాంతపు కార్యక్రమాలు నిర్వహిస్తుంటారు. సభ్యులు ఆయా కార్యక్రమాల్లో పాల్గొనే అవకాశం కల్పిస్తారు. కార్యక్రమాల షెడ్యూల్, ప్యాకేజీ, సభ్యుల సంఖ్యను వెబ్‌సైట్‌లో ప్రకటిస్తారు. వెళ్లాలనుకునే వారు అందులో నమోదు చేసుకోవాలి. ఎంత చార్జీ, ఎన్ని రోజులు, ఏ ప్రాంతం, ఎక్కడికి రావాలి, పాటించాల్సిన నిబంధనలు సూచిస్తారు. సందర్శించే ప్రాంతాన్ని బట్టి ఎన్ని రోజులు అనేది నిర్ణయిస్తారు. అక్కడికి చేరుకున్న పర్యాటకులకు ముందుగానే శిక్షణ ఇచ్చి స్థానిక వాతావరణానికి అలవాటు పడేలా సూచనలు చేస్తారు.

తొమ్మిది యూనిట్లు

రాష్ట్రంలో తొమ్మిది యూనిట్లు ఉన్నాయి. మంచిర్యాల జిల్లాలోని బెల్లంపల్లి యూనిట్‌తోపాటు సైబరాబాద్, గ్రేటర్ హైదరాబాద్ అడహక్, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజిగిరి, మియాపూర్, సికింద్రాబాద్, తెలంగాణ బీటీ ఎస్‌ఆర్, విహంగ మహిళా అడహక్ యూనిట్ ఉన్నాయి. ఆసక్తి గల వారు ఆయా యూనిట్లలో సభ్యత్వం తీసుకుని విహార యాత్ర కార్యక్రమాల్లో పాల్గొనవచ్చు. ఆన్‌లైన్, యూనిట్ ద్వారా బుక్ చేసుకోవాలి. యూనిట్లు నిర్ణయించిన తేదీల్లో పర్యటనకు సూచించిన స్థలానికి మన చార్జీలతో చేరుకోవాల్సి ఉంటుంది. అక్కడి నుంచి పర్యటన పూర్తయ్యే వరకు వసతి సౌకర్యం, ఆహారం నిర్ణయించిన ప్యాకేజీ రుసుంలోనే కల్పిస్తారు.


గోవాలోని జలపాతం

బెల్లంపల్లిలోనూ యూత్ హాస్టల్

బెల్లంపల్లిలోనూ యూత్ హాస్టల్‌ను ఏర్పాటు చేశారు. వైహెచ్‌ఏఐ విజ్ఞప్తి మేరకు సింగరేణి సంస్థ బెల్లంపల్లిలో ఓ భవనాన్ని యూత్ హాస్టల్ కోసం అద్దెకు కేటాయించింది. ట్రెక్కింగ్‌కు వెళ్లడానికి వివిధ రాష్ట్రాల నుంచి వచ్చి ఇక్కడ బస చేస్తారు. గాంధారిఖిల్లా, కుమురంభీం జిల్లా తిర్యాణి జలపాతాలు, జోడేఘాట్, ఆదిలాబాద్ అటవీ ప్రాంతం ట్రెక్కింగ్ కోసం వెళ్తారు.

ఆదిలాబాద్‌లో నిర్వహణకు సన్నాహాలు



బెల్లంపల్లి యూనిట్‌లో 170మంది సభ్యులు ఉన్నారు. జాతీయస్థాయిలో కొన్ని కార్యక్రమాలు ఉంటాయి. ట్రెక్కింగ్, బైకింగ్, సైక్లింగ్, బోటింగ్, ఫ్యామిలీ, చిల్డ్రన్స్ క్యాంప్ రకరకాలు ఉంటాయి. గోవాలో మాన్‌సూన్ ట్రెక్కింగ్, ఉత్తరాఖండ్‌లోని వ్యాలీ ఆఫ్ ఫ్లవర్స్‌కు వెళ్లొచ్చాం. జైసల్మేర్‌లో ఫ్యామిలీ క్యాంప్‌నకు వెళ్లాం. భార్యాభర్తలు, 12ఏళ్లలో పిల్లలకు కలిపి ఒక టెంటు ఇస్తారు. నాలుగు రాత్రులు, ఐదు పగళ్లు ఉండడానికి వసతి సౌకర్యం, ఆహారానికి అంతా కలిపి రూ.7వేల నుంచి రూ.8వేలు చార్జీ చేస్తారు. ఈ క్యాంప్‌లు ఊటి, కులూ, మున్నార్‌లో కూడా ఉంటాయి. గత వేసవిలో హిమాచల్‌ప్రదేశ్‌లోని డోలారిపాస్, లడక్‌లో మోటార్‌సైక్లింగ్‌కు వెళ్లాం. హిమాచల్‌ప్రదేశ్‌లో డల్‌హౌసి ట్రెక్కింగ్‌కు వెళ్లాం. సైక్లింగ్‌కు వెళ్లినప్పుడు సైకిల్ సౌకర్యం కూడా కల్పిస్తారు. ఉత్తరాఖండ్ వంటి ప్రాంతానికి వెళ్లినప్పుడు స్థానిక వాతావరణానికి అలవాటు పడడానికి చిన్న చిన్న ప్రదేశాలకు తీసుకెళ్తారు. తిరుమల తిరుపతి అడవుల్లో కూడా ఒక ట్రెక్కింగ్ నిర్వహిస్తారు. కపిలతీర్థం, రామకృష్ణ తీర్థం కూడా చూడవచ్చు. జాతీయ స్థాయిలో వెళ్లిన ట్రెక్కింగ్‌లకు రాజస్తాన్, గుజరాత్, గోవా, కేరళ తదితర రాష్ట్రాల నుంచి వచ్చిన వారు స్నేహితులయ్యారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని 50కిలోమీటర్ల పరిధిలో పది నుంచి 12 జలపాతాలు ఉన్నాయి. అటవీశాఖ అధికారుల సహకారంతో నాలుగు రోజుల కార్యక్రమం ఆగస్టు తర్వాత నిర్వహణకు సన్నాహాలు చేస్తున్నాం.

–శ్యాంసుందర్‌రెడ్డి, వైహెచ్‌ఏఐ తెలంగాణ వైస్‌ప్రెసిడెంట్, మంచిర్యాల

జీవితంలో మార్పునకు దోహదం



కొత్త కొత్త ప్రాంతాల్లో ట్రెక్కింగ్, సైక్లింగ్ అనేది జీవితంలో మార్పుకు దోహదపడుతుంది. గోవా, హిమాచల్‌ప్రదేశ్‌లోని డల్హౌసి, ఛత్తీస్‌గఢ్‌లోని జగ్దల్‌పూర్, మహారాష్ట్రలోని మహాబలేశ్వర్‌లో ట్రెక్కింగ్‌కు వెళ్లొచ్చాను. యూత్ హాస్టల్‌లో సభ్యులుగా ఉండడం వల్ల చాలా తక్కువ మొత్తంలోనే వివిధ ప్రాంతాలు సందర్శించి రావచ్చు. 2018లో మొదటిసారి హిమాచల్‌ప్రదేశ్‌లో ట్రెక్కింగ్‌కు వెళ్లొచ్చాను. మానసిక ఒత్తిడి నుంచి చాలా ప్రశాంతత పొందాను. బెంగళూర్, మహారాష్ట్ర, హిమాచల్‌ప్రదేశ్, ఆంధ్రప్రదేశ్, కేరళ, ఢిల్లీ తదితర రాష్ట్రాల నుంచి వచ్చిన కొందరు స్నేహితులు అయ్యారు. విద్యావంతులు, వ్యాపారవేత్తలు వస్తుంటారు. ఒకరి ఆలోచనలు మరొకరు పంచుకోవడం వల్ల వ్యక్తిగతంగా, వ్యాపారపరంగా ఎంతో ప్రయోజనం కలుగుతుంది. గోవా అంటే మద్యం, పబ్బులు అనుకుంటారు కానీ పది జలపాతాలు ఉన్నాయి. 12వేల అడుగుల పైకి ట్రెక్కింగ్ చేస్తూ వెళ్లి జలపాతాలు చూడొచ్చు. నేను ఇప్పటివరకు వెళ్లొచ్చిన ట్రెక్కింగ్‌లకు ఒక్కోదానికి రూ.6వేల నుంచి రూ.7వేల వరకు ఖర్చయింది. ఐదు రోజులు ఆహారం, స్థానికంగా రవాణా, బస సౌకర్యం కల్పిస్తారు. ప్రతీ సంవత్సరం వెళ్లొస్తుంటాను. జీవితంలో మార్పు కోరుకునే యువత ట్రెక్కింగ్‌లకు వెళ్లాలి. వ్యక్తిత్వ వికాసానికి దోహదపడుతాయి.

– కొండగొర్ల చంద్రశేఖర్, బెల్లంపల్లి

ఆదివాసీలు సంఘటితం కావాలి

- రిటైర్డ్ జాయింట్ కలెక్టర్ వీరమల్లు


మాట్లాడుతున్న రిటైర్డ్ జాయింట్ కలెక్టర్ వీరమల్లు

బోథ్: ఆదివాసీల మనుగడ కోసం జిల్లాలోని తొమ్మిది తెగలు ఆదివాసీలు సంఘటితం కావాలని రిటైర్డ్ జాయింట్ కలెక్టర్ విరమల్లు పిలుపునిచ్చారు. బోథ్ మండలంలోని పట్నాపూర్ గ్రామంలో న్యాయవాది పంద్రం శంకర్ అధ్యక్షతన శనివారం నిర్వహించిన సమావేశానికి హాజరై ప్రసంగించారు. ఏప్రిల్ 5,6,7 తేదీల్లో భద్రాద్రి కొత్తగూడెంలో నిర్వహించే ఆదివాసీ తెగల మనుగడ, సంస్కృతి పరిరక్షణ కోసం జిల్లాలోని ఆదివాసీలందరూ హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. పోడు భూములు 1/70 పీసా ఏజెన్సీ చట్టాల అమలు వాటి ఆవశ్యకతపై వివరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర సమన్వయకర్త చెంచు రామకృష్ణ, రిటైర్డ్ ఏఎస్పీ సెడ్మాకి గొద్రు, రిటైర్డ్ డిప్యూటీ కలెక్టర్ కుమురం ప్రసాద్, రాష్ట్ర ఉపాధ్యక్షులు మంకిడి బుచ్చయ్య, గోడం మోతిరం, కొడప కోసేరావు, ఆదిలాబాద్ జిల్లా సమన్వయకర్త గోడం మనోహర్, సార్మెడి ఆడేం భీంరావ్, కొండిబా, తుడుందెబ్బ జిల్లా ఉపాధ్యక్షులు రామెల్లి భోజన్న ఉన్నారు.

28న బాసర ఆలయ హుండీ లెక్కింపు

భైంసా: బాసర శ్రీజ్ఞాన సరస్వతి అమ్మవారి ఆలయ హుండీ ఈనెల 28న లెక్కించనున్నట్లు ఆలయ ఈవో విజయ రామారావు శనివారం ఒక తెలిపారు. ఉదయం 9గంటలకు హుండీ లెక్కింపు ప్రారంభమవుతుందని, ఆలయ సిబ్బంది, బ్యాంకు అధికారులు సకాలంలో హాజరు కావాలని కోరారు.

ఆదరణ చూసి ఓర్వలేక కేసులు


సమావేశంలో మాట్లాడుతున్న వెడ్మ బొజ్జు

ఇంద్రవెల్లి: దేశ వ్యాప్తంగా రాహుల్‌గాంధీకి వస్తున్న ఆదరణను చూసి ఓర్వలేకనే అన్యర త వేటు వేశారని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెడ్మ బొజ్జు అన్నారు. శనివారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. తమ నాయకుడిపై ఎన్ని కేసులు పెట్టినా కాంగ్రెస్ పార్టీ ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉందని వివరించారు. దేశ సంపదను అదానీ, అంబానీలకు దోచి పెడుతున్నా.. ప్రజావ్యతిరేక విధానాలను అవలంబిస్తున్న బీజేపీ తీరును వ్యతిరేకిస్తూ మాట్లాడిన రాహుల్ గాంధీపై ప్రధాని కావాలనే కుట్ర చేశారని మండిపడ్డారు. జహీర్, వెంకట్‌రావ్, జితేందర్, భగవాన్ ఉన్నారు.

ఈతకు వెళ్లి యువకుడి గల్లంతు


పూసం పవన్ (ఫైల్)


సంఘటన స్థలాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

నిర్మల్‌టౌన్: చెరువులో ఈతకొడుతూ యువకుడు గల్లంతైన సంఘటన జిల్లా కేంద్రంలో శనివారం చోటు చేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం... బాలాజీవాడకు చెందిన పూసం పవన్ (28) ప్రస్తుతం ధ్యాగవాడలో అద్దెఇంట్లో నివాసముంటున్నాడు. ఐదేళ్ల క్రితం కురన్నపేట్‌కు చెందిన ఝాన్సీని ప్రేమ వివాహం చేసుకున్నాడు. వీరికి నాలుగేళ్ల కుమారుడు ఉండగా, ప్రస్తుతం భార్య నాలుగు నెలల గర్భవతి. పవన్ కూలీ పని చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. అయితే శనివారం ఉదయం స్నేహితుడితో కలిసి.. స్థానిక కురన్నపేట్ చెరువు పక్కనేగల గుడిసెలో మద్యం తాగారు. అతడి స్నేహితుడు పని ఉందని వెళ్తానని చెప్పగా అతడి వద్ద రూ.500 తీసుకున్నాడు. ఆ తర్వాత ఒక్కడే మళ్లీ మద్యం తాగాడు. మత్తులో చెరువులో ఈత కొట్టడానికి వెళ్లి ప్రమాదవశాత్తు మునిగి పోయాడు. గమనించిన స్థానికులు కుటుంబీకులకు, పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఎస్సై జ్యోతిస్మయి సిబ్బందితో చేరుకుని గజ ఈతగాళ్ల సాయంతో గాలింపు చర్యలు కొనసాగిస్తున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ మల్లేశ్ పేర్కొన్నారు.

అనారోగ్యంతో ఎంపీడీవో మృతి


శివలాల్ భుక్యా (ఫైల్)

ఆదిలాబాద్‌రూరల్: అనారోగ్యంతో ఆదిలాబాద్‌రూరల్ ఎంపీడీవో శివలాల భుక్యా శనివారం మృతిచెందింది. జన్నారం మండలం రేండ్లగూడ గ్రామ పంచాయతీ పరిధిలోని రూప్‌నాయక్ తండాకు చెందిన శివలాల్ ఉట్నూర్ మండల కేంద్రంలో నివాసం ఉంటున్నాడు. నార్నూర్ మండల ఎంపీవోగా పనిచేస్తున్న క్రమంలో ఆయనకు ఎంపీడీవోగా పదోన్నతి వచ్చింది. దీంతో ఆయన 2020లో ఆదిలాబాద్ రూరల్ ఎంపీడీవోగా బాధ్యతలు స్వీకరించారు. కొన్ని నెలల పాటు ఎంపీడీవోగా కొనసాగగా అనారోగ్యానికి గురయ్యాడు. ఆరోగ్యం క్షీణించడంతో దీర్ఘకాలిక సెలవులో ఉన్నాడు. ఆరోగ్యం పూర్తిగా క్షీణించి శనివారం మృతి చెందాడు. అంత్యక్రియలు సొంత గ్రామమైన రూప్‌నాయక్ తండాలో నిర్వహించగా మండల అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

గుండెపోటుతో డ్రైవర్ మృతి


కడ్తార్ సింగ్ (ఫైల్)

బోథ్: మండలంలోని సొనాల గ్రామానికి చెందిన కడ్తార్ సింగ్(45) అనే ట్రాక్టర్ డ్రైవర్ గుండెపోటుతో మృతిచెందాడు. కుటుంబ సభ్యుల వివరాల ప్రకారం... సొనాల నుంచి ట్రాక్టర్‌లో శుక్రవారం సాయంత్రం శనగలను మార్కెట్ యార్డుకు తీసుకొచ్చి అక్కడే ఉన్నాడు. రాత్రి 11.30గంటల ప్రాంతంలో గుండెపోటు రావడంతో గమనించిన స్థానికులు వెంటనే స్థానిక ఆసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి రిమ్స్‌కు తరలించగా చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతిచెందాడు.

డ్రంకెన్‌డ్రైవ్‌లో ఐదుగురికి జైలు

ఖానాపూర్: మద్యం తాగి వాహనం నడుపుతూ పట్టుబడిన ఐదుగురికి కోర్టు ఒక్కరోజు జైలు శిక్ష విధించినట్లు ఎస్సై ఆర్.శంకర్ తెలిపారు. పోలీసు శాఖ చేపట్టిన డ్రంకెన్‌డ్రైవ్ తనిఖీల్లో పట్టుబడిన వారిని శనివారం ఖానాపూర్ కోర్టులో జ్యుడిషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ ఎదుట హాజరు పరిచారు. వారికి కోర్టు పై విధంగా శిక్షను ఖరారు చేశారు. మద్యం తాగి వాహనాలు నడిపితే చట్టరీత్యా చర్యలు తప్పవని తెలిపారు.

'బీఆర్‌ఎస్‌కు మూడోసారి విజయం ఖాయం'


శ్యాంపూర్‌లో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ గంగాధర్‌గౌడ్


తలమడుగు: ఎమ్మెల్సీ, ఎమ్మెల్యేను సన్మానించిన నాయకులు

- బీఆర్‌ఎస్ పార్టీ ఆత్మీయ సమ్మేళనం

ఉట్నూర్‌రూరల్: మూడోసారి బీఆర్‌ఎస్ పార్టీ విజయం ఖాయమని ఖానాపూర్ ఎమ్మెల్యే, రేఖానాయక్, ఎమ్మెల్సీ గంగాధర్‌గౌడ్ అన్నారు. శనివారం మండంలోని శ్యాంపూర్ గ్రామంలో బీఆర్‌ఎస్ పార్టీ ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఖానాపూర్ నియోజకవర్గం అభివృద్ధిలో కార్యకర్తలే కీలకమన్నారు. బీఆర్‌ఎస్ పార్టీ ప్రవేశపెట్టిన ప్రభుత్వ పథకాలు, కార్యక్రమాలను ప్రజల్లోకి మరింతగా తీసుకెళ్లాలని కోరారు. నియోజకవర్గ అభివృద్ధిలో కార్యకర్తలే కీలకపాత్ర పోషిస్తూ మూడోసారి విజయమందించడమే లక్ష్యంగా పనిచేయాలని సూచించారు. పార్టీ, పదవులని చూడకుండా అందరూ కలిసికట్టుగా పార్టీ కోసం పనిచేయాలని కోరారు. సంక్షేమ పథకాలు ప్రజలకు అందిస్తుంటే ఓర్వలేక ప్రతిపక్షాలు బురదజల్లే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. బీజేపీ నాయకులు కేంద్రం నుంచి నిధులు తీసుకువచ్చి అభివృద్ధి చేసి చూపించాలని సూచించారు. రానున్న రోజుల్లో దళితబంధు, భూమి ఉండి ఇల్లు కట్టుకునే వారికి రూ.3లక్షలు అందించనున్నట్లు పేర్కొన్నారు. బీఆర్‌ఎస్ పార్టీ ప్రారంభించిన తరువాత దేశంలో పార్టీకి ఆదరణ పెరుగుతోందని వివరించారు. 27న పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించుకునేందుకు తరలిరావాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకులు రోకండ్ల రమేశ్, డీసీసీబీ చైర్మన్ భోజన్న, ఎంపీపీ జైవంత్‌రావు, ఇంద్రవెల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీరాం, ప్రభాకర్ రెడ్డి, వైస్ ఎంపీపీ దావులే బాలాజీ, సర్పంచ్‌లు మల్లిక, హరినాయక్, నాయకులు అజీమొద్దిన్, ధరణి, రాజేశ్ ఉన్నారు.

కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలి..

తలమడుగు: వచ్చే ఎన్నికల్లో బీఆర్‌ఎస్ పార్టీని గెలిపించేందుకు కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలని జిల్లా ఇన్‌చార్జి, ఎమ్మెల్యే గంగాధర్‌గౌడ్ అన్నారు. శనివారం మండలంలోని కజ్జర్ల గ్రామంలో బీఆర్‌ఎస్ పార్టీ ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. వచ్చే ఎన్నికల్లో బీఆర్‌ఎస్ పార్టీకి హ్యాట్రిక్ విజయానికి కార్యకర్తలు ఇప్పటి నుంచి కృషి చేయాలని కోరారు. ప్రతిపక్షాల ఆరోపణలను ఎప్పటికప్పుడు తిప్పికొట్టాలని సూచించారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ, అభివృద్ధి పనులపై ప్రజలకు వివరించాలన్నారు. అనంతరం ఎమ్మెల్యే బాపురావు మాట్లాడుతూ దేశంలోని ఏ రాష్ట్రంలో లేనివిధంగా తెలంగాణ రాష్ట్రం అభివృద్ధి చెందుతుందన్నారు. కార్యక్రమంలో బోథ్ నియోజవర్గ అధికార ప్రతినిధి మొట్టె కిరణ్ కుమార్, గ్రామ పెద్దలు, దేవా రెడ్డి, రైతుబంధు సమన్వయ కర్త గోక జీవన్‌రెడ్డి, మండల కన్వీనర్ తోట వెంకటేష్, ఉపాధ్యక్షులు ప్రకాష్, గ్రామ సర్పంచ్, వెంకటమ్మ, వెల్మ శ్రీనివాసరెడ్డి, కాటిపెల్లి శ్రీనివాస్‌రెడ్డి, ఆశన్న యాదవ్, చంటి పాల్గొన్నారు.

బీజేపీ మహాధర్నాలో జిల్లా నాయకులు

నిర్మల్‌టౌన్: హైదరాబాద్‌లోని ఇందిరాపార్క్ వద్ద బీజేపీ రాష్ట్రశాఖ శనివారం నిర్వహించిన నిరుద్యోగ మహాధర్నాలో జిల్లా నాయకులు పాల్గొన్నారు. జిల్లా నాయకుడు అయ్యన్నగారి భూమయ్య, పెద్దపెల్లి ఇన్‌చార్జి రావుల రాంనాథ్, జిల్లా ప్రధాన కార్యదర్శి మెడిసెమ్మె రాజు, డాక్టర్ మల్లికార్జునరెడ్డి, పెంబి జెడ్పీటీసీ జనకీబాయి, నిర్మల్ అసెంబ్లీ కన్వీనర్ నాయుడి మురళి, పడాల రాజశేఖర్, హరినాయక్, ఓబీసీ మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి అమరవేణి నర్సాగౌడ్, స్టడీ సర్కిల్ రాష్ట్ర కన్వీనర్ కుమ్మరి వెంకటేశ్, బీజేవైఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అనుముల శ్రావణ్, కిసాన్‌మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి ఏలేటి లింగారెడ్డి, ఎస్టీ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి అఖిలేశ్‌జాదవ్‌నాయక్, అఖిల్‌రెడ్డి, అంజుకుమార్‌రెడ్డి, నారాయణరెడ్డి పాల్గొన్నారు.

'చాకిరేవు'కు సోలార్ వెలుగులు


సోలార్‌తో వెలుగుతున్న విద్యుత్ కాంతుల్లో చాకిరేవు గ్రామస్తులు


చాకిరేవులో ఏర్పాటు చేస్తున్న సోలార్ ప్లేట్లు

- 'ఆహా' ఆధ్వర్యంలో ఏర్పాటు
- 15 కుటుంబాల్లో ఆనందం

పెంబి: హీరో బాలకృష్ణ నిర్వహించిన ఆహా కార్యక్రమంలో ప్రోగ్రాంలో నిర్మల్ జిల్లా పెంబి మండలం దోందారి గ్రామ పంచాయతీ పరిధిలోని చాకిరేవు గ్రామ ప్రస్తావన డిసెంబర్ 26న తీసుకొచ్చారు. చాకిరేవు గ్రామస్తులు ఆ కార్యక్రమంలో వారి సమస్యలు తెలిపారు. హీరో బాలకృష్ణ చాకిరేవు గ్రామానికి ఆహా ప్రోగ్రాం ద్వారా గ్రామాభివృద్ధికి రూ.లక్ష చెక్కును అందించడమే కాకుండా గ్రామంలోని 15 కుటుంబాల ఇళ్లకు విద్యుత్ అందించేందుకు సోలార్ సిస్టం ఏర్పాటు చేయిస్తామని హామీ ఇచ్చిన విషయం తెలిసినదే. దీంతో శుక్రవారం 'ఆహా' బృందం చాకిరేవు గ్రామానికి చేరుకుని సోలార్ ఎనర్జీ సిస్టం ఏర్పాటు చేసి ప్రతి ఇంటికి బల్బులు, స్విచ్ బోర్డులు ఏర్పాటు చేసి వెలుతురు ప్రసరించేలా చేశారు. చీకటిలో మగ్గుతున్న మా గ్రామానికి వెలుగునిచ్చిన హీరో బాలకృష్ణకి, 'ఆహా' బృందానికి గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు. ఇందులో టీఏజీఎస్ జిల్లా కార్యదర్శి తోడసం శంభు, గ్రామస్తులు ఉన్నారు.